# దోపిడీకి పాల్పడిన ఇద్దరు నిందితుల అరెస్టు

**వరంగల్ అర్బన్ క్రైం, జూన్ 13:** వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని దేశాయిపేటలో ఒంటరిగా ఇంట్లో ఉన్న వృద్ధురాలిని బంధించి దోపిడీకి పాల్పడిన నిందితుడు, అతడికి సహకరించిన వ్యక్తిని కమిషనరేట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి దోపిడీ చేసిన రూ.5లక్షల విలువ గల 160.5 గ్రాములు బంగారు ఆభరణాలు 48 గంటల్లో స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను సీపీ రవీందర్ బుధవారం సీపీ కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం సుబ్బక్కపల్లి గ్రామానికి చెందిన సముద్రాల రాజు ఆలియాస్ సుద్దాల అనిల్‌రాజు, అదే గ్రామానికి చెందిన మాదారపు భాస్కర్‌రావులు స్నేహితులు. వీరిద్దరు గతంలో 2005 లో మంచిర్యాలలో దొంగతనం చేశారు. కొన్ని రోజులు జైలు జీవితం గడిపి విడుదలయ్యారు. జైలు నుంచి విడుదలైన అనిల్ రాజు, భాస్కర్ రావు స్వగ్రామం సుబ్బక్కపల్లిలోనే ఉన్నారు. రెండేళ్ల కిందట అనిల్‌రాజు వరంగల్ దేశాయిపేటకు మకాం మార్చాడు. రోజువారి కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దేశాయిపేటలో శ్రీ వెంకటేశ్వర కిరాణం షాపు యజమాని రమేష్‌తో పరిచయం పెంచుకున్నాడు. ఈ నెల 10న కిరాణం షాపు యజమాని రమేష్ ఇంటికి అనిల్‌రాజు వెళ్లగా ఇంట్లో రమేష్ అత్త ఉండడాన్ని గమనించాడు. వెనుక నుంచి వెళ్లి వృద్ధురాలి చేతులను తాడుతో కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కాడు. బట్టతో ముఖాన్ని కట్టి బెడ్‌రూమ్‌లో పడేశాడు. తర్వాత బీరువాలో ఉన్న 160.5 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకుని పరారయ్యాడు.

## ఇంతేజార్‌గంజ్ పోలీసులకు పిర్యాదు

చోరీ జరిగిన మర్నాడు షాపు యజమాని రమేష్ వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీఐ.. దర్యాప్తు చేయాలని వరంగల్ సీసీఎస్ పోలీసులకు అప్పగించాడు. రంగంలోకి దిగిన సీసీఎస్ పోలీసులు ఆ ప్రాంతంలో ఉన్న సీసీ టీవీ పుటేజీలను సేకరించి వరంగల్ సైబర్ క్రైం పోలీసులకు అందించారు. వారి వద్ద ఉన్న అధునాత టెక్నాలజీ కలిగిన ఆటోమేటిక్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ డివైజ్‌తో పాటు నేరం జరిగిన చోట సేకరించిన ఫింగర్‌ప్రింట్స్ ఆధారంగా దోపిడీ చేసిన వ్యక్తి అనిల్ రాజుగా గుర్తిస్తారు. వెంటనే సీసీఎస్ సిబ్బంది నిందితుడి కోసం వరంగల్‌తో పాటు వారి స్వగ్రామంలో గాలించారు. కాగా, మంగళవారం దోపిడీ చేసిన బంగారు ఆభరాణాల్లో ఒకటి ఖర్చులకోసం అమ్మేందుకు అనిల్ రాజు, అతడి స్నేహితుడు భాస్కర్ రావు ఇద్దరు వరంగల్ బులియన్ మార్కెట్‌కు వచ్చారు. సమాచారం అందుకున్న వరంగల్ సీసీఎస్, ఇంతేజార్‌గంజ్ పోలీసులు వారిని పట్టుకున్నారు. విచారించగా చేసిన తప్పును ఒప్పుకున్నారు. వీరిద్దరి నుంచి రూ.5లక్షల విలువ చేసే రూ.160.5 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

కాగా, దోపిడీ జరిగిన 48 గంటల్లోనే నిందితులు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్న సీపీఎస్, ఇంతేజాజర్‌గంజ్ పోలీసులను సీపీ అభినందించారు. సిబ్బందికి రివార్డులు వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటరెడ్డి, వరంగల్ ఏసీపీ రాయల ప్రభాకర్‌రావు, ఇంతేజార్‌గంజ్ సీఐ సుంకరి రవికుమార్, సీసీఎస్ సీఐలు రవిరాజు, శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకటకృష్ణ, సుబ్రమ్మాణ్యం, ఫింగర్‌ప్రింట్ నిపుణులు దేవేందర్, ఏఎస్ఐలు వీరస్వామి, చంద్రమౌళి, హెడ్‌కానిస్టేబుళ్లు శివకుమార్, రవీందర్‌రెడ్డి, జంపయ్య, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## ఘటన జరిగిన 48 గంటల్లో పట్టుకున్న సీసీఎస్ పోలీసులు



నిందితుల అరెస్టు చూపుతున్న సీపీ రవీందర్

## కమిషనరేట్‌లో సాంకేతిక పరిజ్ఞానం

వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను ఛేదిస్తున్నామని సీపీ రవీందర్ అన్నారు. నేరాలను నియంత్రించేందుకు ఉపయోగిస్తున్న ఫింగర్ ప్రింట్ డివైజ్‌ను విలేకరుల ముందు ఆవిష్కరించారు. దాని ప్రత్యేకతను సీపీ వివరించారు. ఎఫ్ఎఫ్‌డీలు కమిషనరేట్ పరిధిలో ఆరు పీఎస్‌లలో ఉన్నాయని, స్టేషన్‌లలో కేసులు నమోదయ్యే ప్రతీ ఒక్కరి వేలిముద్రలు ఇందులో నిక్షిప్తమై ఉంటాయన్నారు. ఒక డివైజ్‌లో సుమారు 7 లక్షల మంది డాటాను భద్రపర్చవచ్చని చెప్పారు. దేశంలో ఎక్కడైనా దొంగతనం జరిగితే పాత నేరస్తులైతే క్షణాల్లో నిందితులను ఈ పరికరం ఆధారంగా పట్టుకోవచ్చని అన్నారు. ప్రస్తుతం కమిషనరేట్ పరిధిలో సీసీఎస్, కార్డన్ అండ్ సెర్చ్‌లో అనుమానితులను అదుపులోకి తీసుకుని వారి ఫింగర్ ప్రింట్స్‌ను సేకరిస్తున్నారన్నారు. ఇంకా నేరాలకు పాల్పడే వ్యక్తులపై కోర్టులో శిక్షపడే విధంగా సాక్ష్యంగా పని చేస్తుందని అన్నారు. వరంగల్ కమిషనరేట్‌ను నేర రహిత కమిషనరేట్‌గా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని సీపీ రవీందర్ చెప్పారు.

ఆంధ్రజ్యోతి Thu, 14 June 2018
epaper.andhrajyothy.com/c/29520392